క్లుప్తంగా

వార్డుల అభివృద్ధికి కృషి



మహబూబాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని అన్నివార్డుల అభివృద్ధికి కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. 12వ వార్డు పరిధిలోని అంబేడ్కర్ కాలనీలో సోమవారం మున్సిపల్ సాధారణ నిధులతో రూ.5లక్షల వ్యయంతో నిర్మాణం చేయనున్న సీసీ రోడ్డుకు చైర్మన్ శంకుస్థాపన చేశారు. వైస్ చైర్మన్ మహ్మద్ ఫరీద్, బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జనార్దన్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆంగ్లభాషా దినోత్సవం



మరిపెడ: మరిపెడలోని సీతారాంపురం ప్రభుత్వ పాఠశాలలో సరోజినీ నాయుడు జయంతి సందర్భంగా ఆంగ్లభాషా దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాధురి మాట్లాడుతూ.. సరోజినీ నాయుడు గొప్ప కవయిత్రి అని, ఆమె రచనా శైలీని గుర్తించి గాంధీ భారత కోకిల అనే బిరుదు ప్రదానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రామ్మోహన్, విజయలక్ష్మీ, శ్రీశైలం, ఫిరోజ్‌ఖాన్, నగేష్, శౌరీ, తదితరులు పాల్గొన్నారు.

కుల రహిత సమాజం కోసం కృషి చేద్దాం

నెహ్రూసెంటర్: కుల రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. కుల, మతాంతర వివాహాలను ప్రోత్సహించాలని కోరారు. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా నేడు జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఆదర్శ దంపతుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామని, ఆదర్శ దంపతులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని తెలిపారు.

అదృశ్యమైన మహిళ మృతి

పెద్దవంగర: కూలీ పనులకు వెళ్లి అదృశ్యమైన మహిళ మృతి చెందిన సంఘటన మండల పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఏఎస్సై విజయరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిన్నవంగర గ్రామానికి చెందిన కసుకుంట్ల ఎల్లమ్మ(52) అదృశ్యమైన విషయం తెలిసిందే. కాగా సోమవారం గంట్లకుంట గ్రామ శివారులోని కెనాల్‌లో శవమై కనిపించింది. మృతదేహానికి పంచనామా చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని దర్యాప్తులో తేలిందని ఏఎస్సై తెలిపారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే



గూడూరు: ఓ వృద్ధురాలు సోమవారం ఆస్పత్రికి వెళ్లి చూపించుకొని, వణుకుతూ మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇంటికి నడుచుకుంటూ వెళ్తోంది. అదే సమయంలో అటుగా వెళ్తున్న ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్ వృద్ధురాలిని చూసి వాహనాన్ని ఆపాడు. ఆమె దగ్గరికి వెళ్లి అవ్వా ఎక్కడికి వెళ్తున్నావు అని అడిగాడు. మాది సీతానగరం జ్వరం వస్తే దవాఖానాకు వెళ్లి వస్తున్నాను అని వృద్ధురాలు చెప్పింది. వెంటనే ఎమ్మెల్యే ఆటోను పిలిపించి వృద్ధురాలిని ఇంటికి పంపించి మానవత్వం చాటుకున్నాడు.

తెలంగాణ అన్నివిధాలుగా అభివృద్ధి

- ఎమ్మెల్యే బానోతు శంకర్ నాయక్

నెల్లికుదురు: ఎన్నో ప్రభుత్వాలు పాలించి పట్టించుకోని తెలంగాణ రాష్ట్రాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేసి ఇతర రాష్ట్రాలకు కేసీఆర్ ప్రభుత్వం ఆదర్శంగా నిలిచారని ఎమ్మెల్యే బానోతు శంకర్ నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని, అందిస్తున్న సంక్షేమ పథకాలను చూసి తట్టుకోలేక ప్రతి పక్షాల నాయకులు మతి భ్రమించి నిరాధారమైన ఆరోపణలు చేయడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. అనంతరం మండలంలోని తారాసింగ్ బావి తండా శివారు ధాన్యాతండాలో మాజీ సర్పంచ్ భూక్య ధానా నాయక్ అనారోగ్యంతో మృతి చెందగా కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ బీరవెల్లి యాదగిరిరెడ్డి, మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



నెల్లికుదురు: సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటా

గూడూరు: ప్రమాదంలో చనిపోయిన ప్రతీ కార్యకర్త కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే శంకర్‌నాయక్ అన్నారు. మండలంలోని చిన్న ఎల్లాపురంలో ఇటీవల మృతిచెందిన రెండు కుటుంబాలను సోమవారం సందర్శించి పరామర్శించారు. అనంతరం సీతానగరం గ్రామంలో కార్యకర్తల కుటుంబాలకు ప్రమాదబీమా రూ.2లక్షల చెక్కును అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆరె వీరన్న, నాయకులు సురేందర్ యాదవ్, కుందూరు శోభన్‌రెడి, కట్ల విష్ణుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ..

కేసముద్రం: మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ ఆవుల యుగేందర్ తండ్రి మల్లయ్య ఇటీవల మృతి చెందడంతో ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ బాధిత కుటుంబాన్ని పరామర్శించాడు. ఆయన వెంట ఎంపీపీ వోలం చంద్రమోహన్, జెడ్పీటీసీ శ్రీనాథ్‌రెడ్డి, వైస్ఎంపీపీ రావుల నవీన్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్, మండల అధ్యక్షుడు ఎండీ.నజీర్‌అహ్మద్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

పెద్దవంగర: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు ఒద్దిరాజ్ రాంచందర్‌రావు అన్నారు. మండలంలోని బొమ్మకల్లు గ్రామంలో జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములుగౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టిన స్ట్రీట్ కార్నర్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పెదగాని సోమయ్య, మండల అధ్యక్షుడు సుధాకర్, జిల్లా కార్యదర్శి, ఎంపీటీసీ సాయిని ఝాన్సీ రవి, శంకర్, రవిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

తొర్రూరు రూరల్: సీఎం కేసీఆర్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఒద్దిరాజు రాంచందర్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని అమ్మాపురం గ్రామంలో ప్రజాగోస-బీజేపీ భరోసా కార్యక్రమంలో మాట్లాడారు. సమావేశంలో రాష్ట్ర నాయకుడు పెదగాని సోమయ్య, నాయకులు సురేష్, సురేష్, రాంమోహన్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.



పెద్దవంగర: మాట్లాడుతున్న రాంచందర్‌రావు

కురవి: గ్రామాల్లో బూత్ స్థాయి నుంచి బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ డోర్నకల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుగులోత్ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. సోమవారం కురవిలోని పశువుల సంతలో బీజేపీ ఆధ్వర్యంలో ప్రజాగోస-బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా కార్నర్ మీటింగ్ జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబం, డోర్నకల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే రెడ్యానాయక్ కుటుంబం అవినీతిమయమైందని విమర్శించారు. కేంద్రం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకుడు నామా నాగేశ్వర్‌రావు, మండల అధ్యక్షుడు శ్రీరామోజునాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

అదానీని కఠినంగా శిక్షించాలి

మహబూబాబాద్: అదానీ వ్యవహారం వలన ఎల్‌ఐసీకి వేల కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని, విచారణ చేసి అదానీని కఠినంగా శిక్షించాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథిరెడ్డి డిమాండ్ చేశారు. సీపీఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎల్ఐసీ కార్యాలయం ఎదుట, ఎస్‌బీఐ బ్యాంక్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, యాకాంబ్రం, శ్రావణ్, సాంబలక్ష్మి, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

గార్ల: అదానీని వెంటనే అరెస్ట్ చేయాలని సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు కట్టెబోయిన శ్రీనివాసరావు మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, లోకేష్, సైదులు, శివ, క్రాంతిరామ్, చంద్రు పాల్గొన్నారు.



మహబూబాబాద్: నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

మరిపెడ: మోదీ, అదానీ రహస్య ఒప్పందాలు బహిర్గతం చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు నల్లా సుధాకర్‌రెడ్డి అన్నారు. ఈమేరకు మరిపెడలో స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ముందు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోగుల శ్రీనివాస్‌గౌడ్, టౌన్ కార్యదర్శి మల్లెపాక యాకన్న, పోలేపాక వెంకన్న, శ్రీనివాస్, కృష్ణ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మోడల్ పాఠశాలలుగా తీర్చిదిద్దాలి

చిన్నగూడూరు: ప్రభుత్వ పాఠశాలలను మోడల్ పాఠశాలలుగా తీర్చిదిద్దాలని స్పెషల్ ఆఫీసర్ విజయ్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని గుండంరాజుపల్లి గ్రామంలో మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా ప్రాథమికోన్నత పాఠశాలను మోడల్ స్కూల్‌గా తీర్చిదిద్దేందుకు చేపడుతున్న నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్యాంసుందర్, మురళీధర్ రెడ్డి ఉన్నారు.

పోడు రైతులకు పట్టాలు ఇవ్వాలి

గార్ల: అర్హులైన పోడు రైతులందరికీ ఎలాంటి షరతులు లేకుండా పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వాలని కోరుతూ తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈధర్నాను ఉద్దేశించి టీజీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి భూక్యా హరినాయక్ మాట్లాడారు. ధర్నా అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీటీ వీరన్నకు అందజేశారు. కార్యక్రమంలో శాంతికుమార్, కిషన్‌నాయక్, శ్రీనునాయక్, మంచు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ ప్రశంసనీయం

డోర్నకల్: ప్రాథమిక స్థాయిలోనే సైన్స్ పరికరాలతోపాటు ఇతర ఆకృతలను అద్భుతంగా తయారు చేసి ప్రతిభ కనబర్చడం ప్రశంసనీయమని డోర్నకల్ సీఐ జె.వెంకటరత్నం తెలిపారు. స్థానిక సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో సోమవారం సైన్స్‌ఫెయిర్ కార్యక్రమం ఏర్పాటు చేయగా విద్యార్థులు వివిధ ఆకృతులు, పరికరాలను తయారు చేసి ప్రదర్శించారు. సైన్స్‌ఫెయిర్‌ను తిలకించిన సీఐ విద్యార్థులతోపాటు ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో బడావో బంజారా ఫోజర్ ట్రస్ట్ వ్యవస్థాక అధ్యక్షులు డాక్టర్ లాల్‌సింగ్ లాజరస్, పాఠశాల డైరెక్టర్, కరస్పాండెంట్ ఆనంద్ ప్రేమ్‌సాగర్, పర్యవేక్షకులు పాల్గొన్నారు.



సైన్స్ ఫెయిర్ తిలకిస్తున్న సీఐ

పౌష్టికాహారంతో పిల్లల్లో బరువు పెంచాలి



గూడూరు: వేయింగ్ మిషన్ అందజేస్తున్న సర్పంచ్

గూడూరు: అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం తినిపించి వారు ఆరోగ్యంగా ఉండేందుకు కృషి చేయాలని సర్పంచ్ మంగబాలాజీనాయక్ అన్నారు. మండలంలోని చక్కతండా అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం సర్పంచ్ సందర్శించారు. టీచర్ ఇందిరమ్మ కోరిక మేరకు సర్పంచ్ పిల్లల బరువు చూసేందుకు వేయింగ్ మిషన్‌ను సొంత ఖర్చుతో బహూకరించారు. రమాదేవి, రజిత, విద్యార్థులు పాల్గొన్నారు.

మరిపెడ రూరల్: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని గిరిపురం సర్పంచ్ పెద్దబోయిన జనార్దన్ అన్నారు. మరిపెడ మండలం గిరిపురం గ్రామ పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు వేయింగ్ మిషన్లను సర్పంచ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుమలతసురేష్, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మున్సిపల్ చట్టంపై అవగాహన



శిక్షణలో పాల్గొన్న మున్సిపల్ పాలకవర్గం

మహబూబాబాద్/డోర్నకల్: ఖమ్మం జిల్లా కేంద్రంలోని శిక్షణ, సాంకేతిక అభివృద్ధి కేంద్రంలో రీజినల్ సెంటర్ ఫర్ అర్బన్ అండ్ ఎన్విరాన్మెంటల్ స్టడీస్ (ఆర్‌సీయుఈఎస్) ఆధ్వర్యంలో మానుకోట, మరిపెడ, తొర్రూర్, డోర్నకల్ మున్సిపాలిటీల చైర్మన్‌లకు, వైస్ చైర్మన్‌లకు, కౌన్సిలర్లకు మున్సిపల్ చట్టం 2019పై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెండు రోజులుపాటు శిక్షణ ఉంటుందని మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మహ్మద్ ఫరీద్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్లు సూర్నపు సోమయ్య, వెన్నం లక్ష్మారెడ్డి, చిట్యాల జనార్దన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అధికారుల దాడులు ఆపాలి

కొత్తగూడ: గ్రామాలపై ఫారెస్ట్ అధికారుల దాడులు ఆపాలని సీపీఐ(ఎంఎల్), న్యూడెమోక్రసీ జాతీయ నాయకుడు సాధినేని వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా అడవినే నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్న గూడూరు మండలం దొరవారితిమ్మాపురం గ్రామాన్ని ఖాళీ చేసేందుకు ఫారెస్ట్ అధికారులు బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సమావేశంలో నాయకులు మురళీకృష్ణ, వెంకటయ్య, సీతారామయ్య, బుచ్చిరాములు, యుగేందర్, రాజమల్లు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు

గార్ల: గార్ల మండలం మర్రిగూడెం వేట వేంకటేశ్వర స్వామి దేవాలయంలో రెండో రోజు సోమవారం ద్వారతోరణ, ధ్వజకుంబారాధన, హరణిమధనం కార్యక్రమాలను వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ ఘనంగా నిర్వహించారు. నూతనంగా నిర్మించిన దేవాలయం ప్రాకార మండపం ముఖద్వారం ప్రారంభోత్సవ కార్యక్రమం సందర్భంగా దేవాలయ ప్రాంగణంలో సకల వాస్తు నివారణ కోసం వాస్తుదోష పూజ, వాస్తుహోమం ఘనంగా నిర్వహించారు. ఈపూజా కార్యక్రమాల్లో దేవాలయం అభివృద్ధి కోసం రూ.1.05 కోట్లు విరాళం అందజేసిన ఎన్నారై దంపతులు డాక్టర్ పులి గోపాల్‌రెడ్డి ప్రమీలారెడ్డి దంపతులు పాల్గొన్నారు. అనంతరం విష్వక్సేనా ఆరాధన, పుణ్యాహవాచనం, జయ విజయులు ద్వార పాలకులకు అభిషేకం, అరగింపు కార్యక్రమంను అర్చకులు మధుస్వామి, అచ్యుతాచార్యులు, గోవిందాచార్యులు నిర్వహించారు. పూజల అనంతరం ఎన్నారై దంపతులు భక్తులను అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా బుజ్జి, జిల్లా ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ నందనం కవిత, పుల్లఖడం రమేష్‌బాబు, జిత్తేందర్ అగర్వాల్, ఆలయ కమిటీ చైర్మన్ అమర్‌చంద్ పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న పండితులు

పట్టుదలతో చదివితే బంగారు భవిష్యత్

పెద్దవంగర: విద్యార్థులు పట్టుదలతో చదివితే బంగారు భవిష్యత్ ఉంటుందని రెడ్డికుంట తండాకు చెందిన దాత జాటోతు శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని చిట్యాల గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో చదువుతున్న పదో తరగతి చదువుతున్న 28 మంది విద్యార్థులకు తన సొంత ఖర్చులతో పరీక్ష ప్యాడ్లు, పెన్నులు హెచ్ఎం మడిపెద్ది వెంకన్న సమక్షంలో అందజేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దాత శ్రీనివాస్ తన తల్లి పేరిట సేవా కార్యక్రమాలు చేపట్టడం హర్షనీయమన్నారు. పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు రూ.3వేల ప్రోత్సాహక నగదు అందజేస్తానని తెలపడం అభినందనీయమన్నారు.



అందజేసిన పరీక్ష ప్యాడ్‌లతో విద్యార్థులు

మూఢనమ్మకాలపై అవగాహన



కురవి: విద్యార్థులు మూఢ నమ్మకాలను నమ్మొద్దని సీరోలు ఎస్సై ఎల్.నరేష్ అన్నారు. సోమవారం మండలంలోని సూదనపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో సీరోలు పోలీసుల ఆధ్వర్యంలో మూఢనమ్మకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం ధరావత్ వెంకన్న, గాండ్ల లింగయ్య, ఉపాధ్యాయులు చిన్నం ప్రదీప్‌కుమార్, మాధవరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

నెహ్రూసెంటర్: విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన విద్యుత్ వినియోగదారుల సదస్సుకు హాజరై వినియోగదారుల సమస్యలను ప్రస్తావించారు. ప్రజలపై విధిస్తున్న ఏసీడీలను రద్దు చేయాలని, ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌పార్మర్లకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. పెరుగు కుమార్, రేషపల్లి నవీన్ పాల్గొన్నారు.

'హాకా' చైర్మన్‌ను కలిసిన వ్యాపారులు

మరిపెడ రూరల్: హాకా చైర్మన్ శ్రీనివాస్‌ను హైదరాబాద్‌లో పట్టణానికి చెందిన సూర్యతేజ ఏజెన్సీ నిర్వాహకులు ఉప్పల వెంకటేశ్వర్లు, ఉప్పల సత్యం మర్యాదపూర్వకంగా సోమవారం కలిశారు.

సంక్షిప్త సమాచారం

గ్రీవెన్స్‌కు రెండు ఫిర్యాదులు

కురవి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం మొదలైన గ్రీవెన్ సెల్‌లో కురవికి చెందిన బండారి రమేష్ మొదటి ఫిర్యాదు చేశాడు. బస్టాండ్ పక్కన సీసీ రోడ్డుపై కొందరు వ్యక్తులు ఇళ్ల నిర్మాణాలు చేసుకోవడంతో రోడ్డు పక్కన ఉన్న ఖాళీ స్థలంలోకి వెళ్లకుండా దారిని మూశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రెండు ఫిర్యాదులు వచ్చాయని తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు.

'ఆరోపణలు చేయడం తగదు'

గార్ల: ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ హరిసింగ్‌నాయక్ పై నిరాధారమైన ఆరోపణలు చేయడం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అవివేకానికి నిదర్శనమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఎంపీటీసీ రమేష్, సర్పంచ్‌లు జ్యోతి, భారతి, రాంబాయి, గణేష్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

మహబూబాబాద్ రూరల్: బైండ్ల పూజారి గంగుల శ్రీనును ముత్యాలమ్మ పూజారులైన బొడ్డుపల్లి వంశీకులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మా అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డుపెల్లి ఉపేంద్రం మాట్లాడుతూ.. బొడ్రాయి వేడుకలను విజయవంతం చేయడంలో శ్రీను విధులను బాధ్యతాయుతంగా వ్యవహించాడని తెలిపారు. కార్యక్రమంలో కొమరమ్మ, పద్మ, మాధురి, వెంకటయ్య, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

సమాచారం ఆన్‌లైన్‌లో పొందుపర్చాలి

నెల్లికుదురు: మండలంలోని వివిధ గ్రామాలల్లోని ప్రభుత్వ పాఠశాలల సమగ్ర సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందుపరచాలని ఎంఈఓ గుగులోతు రాము హెచ్ఎంలకు సూచించారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో సోమవారం యూడైస్ ప్లస్ ఆన్‌లైన్ పోర్టల్‌లో పాఠశాలల సమాచారాన్ని పొందుపరిచే విధానంపై పాఠశాలల హెచ్ఎంలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎంలు ఖలీద్ అహ్మద్, స్వామి, వివిధ పాఠశాలల హెచ్ఎంలు సీఆర్‌పీలు పాల్గొన్నారు.

తప్పిపోయిన వృద్ధురాలి అప్పగింత



కేసముద్రం: మతిస్థిమితం సరిగ్గాలేని ఓ వృద్ధురాలు ఇంటి నుంచి తప్పిపోయి, వాట్సాప్ ద్వారా ఆమె ఆచూకీ తెలుసుకుని తిరిగి ఇంటికి చేర్చిన సంఘటన కేసముద్రం మండలం ధన్నసరి శివారు చౌళ్లతండాలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. మండల కేంద్రానికి చెందిన ఉల్లెందుల యాకమ్మ అనే వృద్ధురాలు కొద్దిరోజులుగా మతిస్థిమితం సరిగ్గాలేక మండలంలోని ధన్నసరి శివారు చౌళ్లతండాలో ఒంటరిగా తిరుగుతుంది. తండాకు చెందిన కొర్ర భరత్ అనే వ్యక్తి వాట్సాప్‌లో వృద్ధురాలి ఫొటోను పోస్ట్ చేశాడు. ఈక్రమంలో ఆమె అడ్రస్ తెలిసింది. ఎస్సై రమేష్‌బాబు తమ వాహనంలో కానిస్టేబుల్, ఎస్‌జీఎఫ్ ఫౌండేషన్ సభ్యులు రాజా, మహేష్ అనే యువకుల సహకారంతో కుటుంబ సభ్యులకు అప్పగించారు.

తుది నిర్ణయం కలెక్టర్‌దే..

- సీఎం కేటాయించిన నిధుల విషయంలో కసరత్తు
- డీపీఆర్ నిమిత్తం కన్సల్టెన్సీ కోసం ప్రకటన
- విడుదలైన జీఓ ప్రకారం అధికారుల చర్యలు

మహబూబాబాద్: జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలకు కేటాయించిన నిధుల విషయంలో తుది నిర్ణయం జిల్లా కలెక్టర్‌కే అప్పగిస్తూ ప్రభుత్వం జీఓను విడుదల చేసింది. ఆ పనులను ఫైనల్ చేసేది కలెక్టరేనని అధికారులు తెలిపారు. జీఓ ప్రకారం అధికారులు కసరత్తు చేస్తున్నారు. జీఓ విడుదల కాకముందే ఎమ్మెల్యే శంకర్‌నాయక్ ఆ నిధులలో పది కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఆ విషయంలో అధికారులకు తలనొప్పిగా మారింది.

గత నెల 12వ తేదీన జిల్లాలో సీఎం కేసీఆర్ పర్యటించిన నూతన కలెక్టరేట్‌తోపాటు, బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంను సీఎం ప్రారంభించిన విషయం విధితమే. ఆ కార్యక్రమంలో సీఎం కేసీఆర్ జిల్లాకు వరాల జల్లు కురిపించారు. వరాలలో మానుకోట మున్సిపాలిటీకి రూ.50 కోట్లు, తొర్రూరు, మరిపెడ, డోర్నకల్ మున్సిపాలిటీలకు రూ.25 కోట్ల చొప్పున ప్రకటించారు. నిధులకు సంబంధించిన జీఓను విడుదల చేశారు.

జీఓ ప్రకారం అధికారుల కసరత్తు

నిధుల విషయంలో నాలుగు మున్సిపాలిటీలకు సంబంధించిన రూ.125కోట్లు ఖర్చు చేసే విషయంలో తుది నిర్ణయం కలెక్టర్‌దే అన్న విధంగా జీఓలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. కలెక్టర్ ద్వారా ఆపనులకు సంబంధించిన ప్రతిపాదనలు రాగానే దాని ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు. మానుకోట మున్సిపాలిటీ నుంచి నిధులకు సంబంధించిన పనుల నిమిత్తం డీపీఆర్ తయారు చేయడానికి కన్సల్టెన్సీ కోసం పేపర్ ప్రకటన ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. జీఓ ప్రకారం అధికారులు కసరత్తు చేపట్టారు. ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ మాత్రం జిల్లా కేంద్రంలో ఇండోర్ స్టేడియం నిర్మాణం కోసం దానిలో రూ.10కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. మున్సిపాలిటీకి కేటాయించిన రూ.50కోట్లలో స్టేడియానికి పది కోట్లు పోను రూ.40 కోట్ల లెక్క మాత్రమే ఉంటుంది. కాని ముందుగా రూ.50కోట్ల నిధుల విషయంలో జీఓ ప్రకారం చేసేందుకు కసరత్తు మొదలు పెట్టారు. కలెక్టర్ సమక్షంలో సమావేశం నిర్వహించి మున్సిపాలిటీల పరిధిలో అత్యవసర పనులు ఇతరత్రా వాటిపై ప్రజాప్రతినిధులతో సంబంధిత అధికారులతో చర్చించి నిధులపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.



మానుకోట మున్సిపాలిటీ కార్యాలయం

స్వయం పరిపాలన దినోత్సవం



మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని కంకరబోడ్ జెడ్పీహెచ్ ప్రభుత్వ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రావు, ఉమాదేవి, శకుంతల పాల్గొన్నారు.